




## (గత సంచిక తరువాయి)

7

**మోహన్ ని చూడగానే** పవిత్రకి ఒంటి నిండా కారం రాసుకున్నట్టు మండిపోయింది. అంతేకాదు, ఆ సమయంలో, అక్కడ చాముండేశ్వరిని చూసినా అదే చిరాకు వేసింది. నిజానికి పవిత్రకి చాముండేశ్వరి అంటే ఇష్టం కారణం మోహన్ లాగా కాకుండా, ఆవిడ అందంగా ఉంటుంది. ఎప్పుడూ ఖరీదైన గద్వాల చీరలు కట్టుకుని, రింగు ముడి వేసుకుని, ముడిలో కచ్చితంగా సీజన్ ని బట్టి ఏ పూలు లభిస్తే వస్తే, ఆ పూలు పెట్టుకుంటుంది. ఏది లేకపోతే గులాబీఎర్రని ముద్ద మందారం పూవు అయినా పెట్టుకుంటుంది. మొహానికి పసుపు రాసుకుని, పావలా కాసంత కుంకుమ బొట్టు, కళ్ళ నిండా కాటుకతో, మెడలో సూత్రం గొలుసుతో పాటు, నల్లపూసల దండ, ముత్యాల దండ, పగడాల దండతో, పచ్చని ఒంటి రంగుతో ఎప్పుడు చూసినా అలంకరించుకుని, అందంగా ఉంటుంది.  ఆరోజు వంగపూవు రంగుకి నల్లటి బోర్డర్ ఉన్న చీర కట్టుకుంది. పచ్చని ఆ ఒంటి మీద ఆ రంగుకే అందం వచ్చినట్టు అనిపిస్తోంది.

అమ్మ కూడా ఇలా తయారైతే బాగుంటుందేమో అనిపిస్తూ ఉంటుంది పవిత్రకి.

ఆవిడకన్నా వర్ధని వయసులో రెండు, మూడేళ్ళు చిన్నదే.  అయినా, బయటకు వెళ్ళేటప్పుడు తప్ప, పెద్దగా అలంకరించుకోదు. ఇంట్లో ఉన్నప్పుడు నాజూగ్గా వాయిల్ చీరలు కట్టుకుని, మెడలో సూత్రం గొలుసు, రెండువరసల నల్లపూసలు వేసుకుంటుంది. ఆవిడ పొడుగాటి వాలుజడ వేసుకుంటుంది. బయటకు వెళ్ళేటప్పుడు మాత్రం భర్త హోదాకి తగినట్టు ధర్మవరం పట్టుచీరలు కట్టుకుని, చీరకు తగిన నగలు వేసుకుని వెళ్తుంది. కొంచెం ఆధునికంగా ఉంటుంది.

కాకపోతే, ఆ క్షణం ఆవిడని చూడడం ఏ మాత్రం నచ్చలేదు. బహుశా మోహన్ అంటే కోపం వల్ల కావచ్చు లేదా తను రావద్దని నిక్కచ్చిగా చెప్పినా రావడం, అదికూడా తల్లితో కలిసి రావడం వల్ల కావచ్చు.

తన అయిష్టాన్ని మొహంలో కానీ, నడకలో కానీ వ్యక్తం కానీకుండా ఆవిడ వైపు చూసి మర్యాదపూర్వకంగా నవ్వింది. పవిత్రని చూడగానే ఆవిడ కళ్ళల్లో ఒక మెరుపు తళుక్కుమంది.

“ఏమ్మా కులాసానా?” ఆదరంగా పలకరించింది ఆవిడ.

“రా అమ్మడూ!” తన పక్కన చోటు చూపిస్తూ పిలిచింది నాంచారమ్మ.

మోహన్ కి కనిపించకుండా తన గదిలోకి వెళ్ళిపోదామనుకున్న పవిత్ర నాంచారమ్మ ఆహ్వానించడంతో కావాలని మోహన్ పక్కనుంచే ఆవిడ మంచం దగ్గరగా నడిచి వెళ్ళి, మంచం మీద కూర్చుంది.

"ఏమ్మా బంగారూ! ఆరోజు అమ్మవారి పూజకి వచ్చావు... మళ్ళీ కనిపించలేదు"ప్రేమగా అడిగింది చాముండేశ్వరి.

పవిత్ర మాట్లాడలేదు. ఏమని చెప్పాలో అర్థం కాలేదు. జుట్టు మొత్తం పట్టుకుని కుడివైపు వేసుకుని, చివర్లు తిప్పుతూ నాంచారమ్మ వైపు చూసింది.

"తలంటి పోసుకున్నావా? మహాలక్ష్మిలా ఉన్నావు. ఏవిటో పక్కనే ఉన్న నిన్ను చూడ్డానికి ఇన్ని రోజులు పట్టింది. నాకూ అసలు సమయం కుదరలేదు. మా ఆడపడుచుకి ఆరోగ్యం బాగా లేదంటే బెజవాడ వెళ్లి వచ్చాను. ఇలారా చిక్కు తీసి జడవేస్తాను" అంటూ ఆవిడ ఆప్యాయంగా చేతులు చాచి పసిపిల్లను పిలుస్తున్నట్టు పిలుస్తుంటే, తలతిప్పి చిత్రంగా ఆవిడవైపు చూసింది.

అప్పటివరకు తల్లి పక్కన నిశ్శబ్దంగా నిలబడిన మోహన్ పవిత్ర వచ్చి అక్కడ కూర్చోవడంతో ఇబ్బందిగా కదిలి, నాంచారమ్మతో "మళ్ళీ వస్తాను బామ్మా పనుంది" అని చెప్పి తలవంచుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

'హమ్మయ్య'అతను అక్కడి నుంచి వెళ్ళిపోగానే ఊపిరి తీసుకుంది పవిత్ర. అతన్ని చూస్తే చాలు ఒళ్లంతా భగభగ మండుతుంది. కారణం తనకే తెలియడంలేదు. అంత కోపంగా ఉన్నా, ఎక్కడో అంతరాంతరాల్లో అతనలా వెళ్ళిపోడం తనని అవమానించినట్టుగా అనిపించి, మనసులోనే పళ్ళు కొరికింది. ఎంత పొగరు! తనిప్పుడు ఎంత అందంగా ఉంది! ఒక్కసారి కూడా తలెత్తి చూడలేదంటే పొగరేగా!

నిజంగానే పవిత్ర అప్పుడు అలంకరించిన మేఘంలా ఉంది. తలంటి పోసుకున్న కురులు అలా కూర్చుని, కూర్చునే వదులుగా జడ అల్లుకుంది. ఒత్తుగా చెంపల మీద పడిన కురులు సున్నితంగా ఆమెతో గుసగుసలాడుతున్నట్టు కదులుతున్నాయి.

"మీ మనవరాలు ఎంతటి సౌందర్యరాశి పిన్నిగారూ!" అంది అబ్బురంగా పవిత్రనే చూస్తున్న చాముండేశ్వరి.

అప్రయత్నంగా పవిత్ర చెక్కిళ్ళు రాగరంజితం అయ్యాయి.

ఇదంతా సిగ్గే! మెత్తటి స్పర్శ... వెచ్చని ఊపిరి...

పవిత్ర త్రుళ్ళిపడింది.

శివా! అవును శివే ఈ స్వరం అతనిదే. ఒళ్ళంతా పొగడపూల వర్షం కురిసింది. మనసంతా శివ ఆక్రమించాడు. ఇప్పుడు, ఇక్కడ శివ ఉండి ఉంటే, అచ్చు అక్కినేని సావిత్రి ముంగురులు సవరించినట్టు తన ముంగురులు సవరించి, మేఘాలతో దోబూచులాడుతున్న చందమామలా ఉంది నీ మోము అనేవాడేమో! ఊహలపల్లకి ఎక్కబోతున్న పవిత్ర చాముండేశ్వరి "రామ్మా పవిత్రా! జుట్టు చిక్కుతీస్తాను" అంటూ పిలవడంతో చికాగ్గా చూసింది.

పవిత్ర గబుక్కున లేచి నిలబడి, "ఒద్దండి నేను వేసుకుంటాను" అని చెప్పి చర,చరా పైకి వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి ప్రవర్తనకి చిన్నబోయిన ఆవిడ మొహం చూసి "మా పవిత్ర పెద్దదయింది. ఎవరు వేసినా నచ్చదు దానికి. తనే చిక్కుతీసుకుని జడ వేసుకుంటుంది" అంటూ సర్ది చెప్పింది.

వర్ధని కాఫీ తీసుకుని వచ్చింది.

"కులాసానా వదినగారూ!" అంటూ పలకరించి కాఫీ కప్పు అందిస్తూ అడిగింది. "మోహన్ వచ్చినట్టున్నాడు. ఏడీ?"

ఆవిడ చేతిలో మరో కప్పు చూసి "వాడికేదో పనుందని వెళ్ళాడులెండి... అయినా మా వాడికి పెద్దగా కాఫీ ఇష్టం ఉండదు" అంది చాముండేశ్వరి.

వంగపండు రంగు గద్వాల చీరలో మెరిసిపోతున్న చాముండేశ్వరిని చిరునవ్వుతో అడిగింది వర్ధని. "ఎక్కడికన్నా బయటకు వెళ్తున్నారా వదినగారూ?"

పవిత్ర తన గదిలోకి వెళ్లి తలుపులు ఓరగా తీసిపెట్టి అద్దం ముందు నిలబడి జుట్టు చిక్కు తీసుకుంటూ వాళ్ళు మాట్లాడుకుంటున్న మాటలు ఆసక్తిగా వినసాగింది.

"అబ్బే! మీ ఇంటికే వచ్చాను. మా మోహన్ నేను బెజవాడ నుంచి తిరిగి వచ్చిన దగ్గర నుంచి ఒకటే చెబుతున్నాడు బామ్మగారు పడ్డారు వెళ్లి పలకరించు అని" అంది.

"మీ ఆడబడుచు బెజవాడలో ఎక్కడా ఉండేది?" అనడిగింది నాంచారమ్మ ఆవిడకి బెజవాడ మొత్తం తెలుసు... ఎంతోమంది బంధువులు ఉన్నారు అక్కడ. ఒకప్పుడు తరచూ వెళ్తూ ఉండేది. తరాలు మారుతుంటే అనుబంధాలు పలచబడి రాకపోకలు తగ్గిపోయాయి.

"సత్యనారాయణపురంలో ఉంటారు. ఆవిడకి ఇద్దరాడపిల్లలు. పెద్దది డిగ్రీ పూర్తిచేసింది. సంబంధం కుదిరిందిట. రెండోది ఇప్పుడు డిగ్రీ మొదటి సంవత్సరంలోకి వచ్చింది. పిల్లలిద్దరూ బంగారు బొమ్మలు. లక్షణమైన సంబంధం కుదిరింది. తాంబూలాలు కూడా పుచ్చేసుకున్నారు మేము అక్కడ ఉన్నప్పుడే."

"అలాగా! మీ ఆడబడుచు ఆరోగ్యం బాగాలేదు అన్నారు."

"ఆవిడకి భయం ఎక్కువ. రెండు రోజులు జ్వరం రాగానే కంగారు పడిపోతుంది. మాకు అలవాటే ఆవిడ తత్త్వం. అలాంటప్పుడు వెళ్లి కాస్త ధైర్యం చెప్పి వస్తుంటారు ఆవిడ అన్నగారు." నవ్వింది చాముండేశ్వరి.

నాంచారమ్మ, వర్ధని కూడా నవ్వారు.

స్పష్టంగా వినిపిస్తోంది వాళ్ళ సంభాషణ పవిత్ర గదిలోకి. కుతూహలంగా వినసాగింది. ఆవిడ ఆడబడుచు సంగతి నానమ్మకి ఎందుకబ్బా అనుకుంది.

జడ అల్లుకోడం పూర్తి చేసి, వెనక్కి వేసుకుంది, కళ్ళకి కాటుక దిద్దుకుని, గులాబీరంగు పరికిణీ, ఓణీ వేసుకుని, మెడలో ఒంటిపేట గొలుసు వేసుకుంది.

చాముండేశ్వరి స్వరం వినిపిస్తోంది ఆవిడ కొంచెం గట్టిగా మాట్లాడుతుంది.

"ఆయన భోజనానికి వచ్చే వేళ అయింది... ఉంటాను పిన్నిగారూ! మీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి. మీకు నయమై కాస్త నడవడం మొదలు పెట్టాక సావకాశంగా కూర్చుని మాట్లాడుకుందాం. వస్తాను వర్ధనమ్మా... ఏది పవిత్ర? ఓసారి పిలవండి" అని అంటూనే తనే పిలిచింది "పవిత్రా!" అంటూ.

పవిత్ర జడ ముందుకు వేసుకుని, గదిలో నుంచి బయటకు వచ్చి, సావకాశంగా జడ చివర్లు అల్లుకుంటూ మెట్లు దిగసాగింది.

"రావమ్మా పగడాలరెమ్మా... ఇలా కనిపించి అలా మాయమై పోయావు." నవ్వుతూ చేతులు చాపింది. చాముండేశ్వరి.

పవిత్ర ఇబ్బందిగా నాంచారమ్మ వైపు చూసింది. వెళ్ళు అన్నట్టు ఆవిడ కళ్ళతో సైగ చేసింది.

పవిత్ర అయిష్టంగా ఆవిడకి దగ్గరగా నడిచింది.

ఆవిడ పవిత్రని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని, "నువ్వు అడుగు పెట్టిన ఇల్లు సిరి, సంపదలతో నిండిపోతుందే" అంది.

కనిపించీ కనిపించని నవ్వు విసిరేసి దూరం జరిగింది పవిత్ర.

"వస్తాను. మీరు త్వరలో లేచి తిరుగుతారు కంగారేం పడకండి. మంచి వార్త కూడా వింటారు" ముసి,ముసిగా నవ్వుతూ వెళ్ళిపోయింది ఆవిడ.

ఆవిడ వెళ్ళిన వైపు తదేకంగా చూస్తూ, ఆవిడ గేటు దాటిన శబ్దం అవగానే వర్ధని వైపు చూసి, "ఏవిటే ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలి సావకాశంగా వస్తాను అంటుంది. ఏవిటై ఉంటుంది?" సాలోచనగా అడిగింది నాంచారమ్మ.

"ఏవుంటుంది? నాకు మాత్రం ఏం తెలుసు?" అంది వర్ధని కాఫీగ్లాసు తీసుకుని వంటగదిలోకి వెళ్ళబోతూ.

"కొంపదీసి వాళ్ళ పెద్దాడికి మన పవిత్రని అడగదు కదా"

పవిత్ర చివ్వున నాంచారమ్మ వైపు చూసింది.

"అప్పుడే పవిత్రకి పెళ్ళేంటి? మీరు ఏవేవో ఊహించుకోకండి." అత్తగారి చాదస్తానికి చిరాకుపడింది వర్ధని.

"ఏంటి పెళ్లి అంటున్నారు" లోపలికి వచ్చిన మాధవ అడిగాడు.

"పక్కింటి చాముండేశ్వరి గారు వచ్చి వెళ్ళారు. వెళ్తూ, వెళ్తూ మీ అమ్మగారితో ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలి సావకాశంగా వస్తాను అని చెప్పి వెళ్ళారు. అందుకని ఆవిడ ఇంకేదో ఊహిస్తున్నారు." భర్త ప్రశ్నకి సమాధానం చెప్పింది వర్ధని.

"ఏంటమ్మా?" అడిగాడు మాధవ ఆవిడ పక్కన మంచ చివర కూర్చుంటూ.

"నాకేదో అనుమానం వచ్చింది రా వాళ్ళ పెద్దబ్బాయి ఆవిడలాగే చక్కగా ఉంటాడు. అతనికి మన పవిత్రని అడుగుతోందా అని అనుమానంగా ఉంది."

పవిత్ర కోపంగా అరిచింది. "నానమ్మా పిచ్చి, పిచ్చి ఆలోచనలు రానివ్వకు నాకు పెళ్ళేంటి అప్పుడే"

"అవును అప్పుడే నా చిట్టితల్లికి పెళ్ళేంటి? అది బాగా చదువుకుని డాక్టర్ అయి, ఇంకో డాక్టర్ ని పెళ్లి చేసుకుంటుంది."

మిగతా మాటల సంగతి ఎలా ఉన్నా, మరో డాక్టర్ ని పెళ్లి చేసుకుంటుంది అన్న మాటలు మాత్రం పవిత్ర చెవులకి మంత్రం లా వినిపించాయి. చెక్కిళ్ళలో కెంపులు పూసాయి.

ఆ ఎరుపుదనం కనిపించకుండా మొహం కొద్దిగా పక్కకి తిప్పుకుంటూ "పో నాన్నా. నేను నాగలక్ష్మి ఇంటికి వెళ్తున్నా" అంటూ తూనీగలా పారిపోయింది.

పెళ్ళిమాట ఎత్తగానే పవిత్ర మొహంలో వచ్చిన మార్పులు చూసి ముగ్గురూ సరదాగా నవ్వుకున్నారు.

సమయం, సాయంత్రం మూడు నలభై అయి ఉండచ్చు.

ఏ ఎన్ ఆర్ కాలేజి గేటు ముందు తెల్లని అంబాసిడర్ కారు ఆగింది.

క్లాసులు ముగించుకుని, బయటకి వస్తున్న విద్యార్థులను చూస్తుంటే, కొలను గట్టున తిరుగుతున్న బాతుల్లా, పావురాళ్ళ గుంపులుగా అనిపిస్తున్నారు. గలగలలాడుతూ నడుస్తున్న ఆ యువతీయువకుల నవ్వులతో ప్రాంగణం అంతా పసిడికాంతులు ప్రసరిస్తున్నట్టు వెలిగిపోతోంది.

మిత్రురాళ్ళ మధ్య నడిచివస్తున్న పవిత్ర చెలికత్తెల మధ్య రాజకుమారిలా ఉంది.

కారు ఆపి, స్టీరింగ్ మీద చేతులతో దరువు వేస్తూ, కూలింగ్ గ్లాసెస్ నుంచి ఆమెకోసం చూస్తున్నాడు డాక్టర్ శివరామకృష్ణ.

"ఏయ్ పవిత్రా! నిన్న మేము పూజాఫలం చూసామే. జమున అచ్చు నీలా ఉంది. అవునూ నీ అక్కినేని ఎక్కడా?" అల్లరిగా అడిగింది సత్య.

"అక్కినేనా ఎవరే వాడు?" ఆశ్చర్యం నటించింది శ్రీదేవి.

"కొట్టానంటే పళ్ళు ఊడి కింద పడతావు" శ్రీదేవి మీదకి చేయెత్తింది పవిత్ర.

ఫక్కున నవ్వుతూ ఎడంగా జరిగింది శ్రీదేవి.

"అతను నిన్ను ప్రేమిస్తున్నాడే పాపం..."

"అవునా పాపం అయితే! రేపటి నుంచీ నిన్ను ప్రేమించమని చెప్తాలే" వెక్కిరింతగా అంది పవిత్ర.

"ఒక్కసారి ప్రేమగా మాట్లాడచ్చుగా మరీ అంత అన్యాయంగా కసురుకుంటావెందుకు? అంది నాగలక్ష్మి.

"ఒట్టి కసురుకుంటే పర్లేదు అతని ఒంటి రంగుని గుర్తు చేస్తూ అవమానిస్తుంది. తప్పే పవిత్రా అతని కళ్ళల్లో కన్నీళ్లు చూసాను ఆరోజు నువ్వు అవమానించిన రోజు" సానుభూతిగా అంది సత్య.

"అబ్బా ఆపుతారా? నీకంత జాలిగా ఉంటే నువ్వు ప్రేమించు, నువ్వు కబుర్లు చెప్పు, ఇంకా కావాలంటే నువ్వు పెళ్లి చేసుకో..." ముగ్గురి వైపు వేళ్ళు చూపిస్తూ అని బాగ్ జారిపోతుంటే వీపు మీదుగా పైకి జరుపుకుంటూ రీవిగా అంది పవిత్ర. "నాకోసం ఆరడుగుల అందగాడు రెక్కల గుర్రం మీద వస్తాడు... నా మెడలో పూలదండ వేస్తాడు. శ్రీ కృష్ణుడు రుక్మిణీదేవిని ఎత్తుకుని వెళ్ళిపోయినట్టు వెళ్ళిపోయి, గాంధర్వ వివాహం చేసుకుంటాడు. నేను మహారాణిలా ఉంటాను. ఇంకోసారి ఆ సన్నాసి మాట ఎత్తారంటే తోలు ఒలుస్తా." అంటూ గట్టిగా హెచ్చరిస్తున్న పవిత్ర చెవులకి మృదు గంభీరంగా వినిపించింది "పవిత్రా" అని.

పవిత్ర ఉలిక్కిపడి ఒక అడుగు వెనక్కి వేసింది. తన వెనకే ఉన్న సత్య పడబోతే, శ్రీదేవి పట్టుకుని "చూసి నడవ్వే దాన్ని పడేస్తున్నావు" అంది.

నాగలక్ష్మి దృష్టి గేటుపక్కన ఆగిఉన్న కారు వైపు, డ్రైవర్ సీటులో కూర్చున్న వ్యక్తి మీదా పడింది. ఒక్కసారిగా గుండె ఆగినంత పనైంది.

పవిత్ర చెవి దగ్గరగా నోరు పెట్టి "వచ్చేసాడు... వచ్చేసాడు ఆరడుగుల అందగాడు... రెక్కల గుర్రం తీసుకుని వచ్చేసాడు" అంది.

నాగలక్ష్మి మాటలకి పవిత్ర బిత్తరపోయి చూసింది ఆమె మొహంలోకి "పిచ్చి పట్టిందా ఏంటి వాగుతున్నావు?" అంది కోపంగా.

నాగలక్ష్మి పళ్ళు బిగపట్టి "అటు చూడు, నీ కుడిచేయి వైపు... నిన్నే పిలుస్తున్నాడు... ఆరడుగుల" నాగలక్ష్మి మాటలు పూర్తికాకుండా గట్టిగా "నోర్ముయ్" అని అంటూనే ఆమె చూపించిన వైపు చూసింది.

అప్పుడే డాక్టర్ శివరామకృష్ణ కుడిచేయి స్టీరింగ్ మీద నుంచి తీసి, కళ్ళకున్న కూలింగ్ గ్లాసెస్ తీసాడు.

పవిత్ర పాదాలు నేలకి అంటుకుపోయాయి... కళ్ళల్లో శతకోటి నక్షత్రాల వెలుగు విరిసింది. ఒళ్ళంతా చందనం పూసినట్టు పరిమళభరితం అయింది.

ఇతను ఇక్కడా? ఎలా? తన కలల రాకుమారుడు... మనసు దోచిన చెలికాడు ఇక్కడికెలా వచ్చాడు?

సరిగ్గా విండో దగ్గర శిలలా నిలబడిపోయిన పవిత్ర అతను గబుక్కున కార్ డోర్ తీస్తే అతని ఒడిలో పడిపోతుంది.

అతను తల కొద్దిగా బయటకు వంచి "ఇంటికేనా? రా నేనూ మీ ఇంటికే" అన్నాడు.

పవిత్ర చటుక్కున తన స్నేహితురాళ్ళ వైపు చూసింది. అతనలా పిలుస్తుంటే చెక్కిళ్ళు రాగరంజితం అయినాయి. మనసు పరిమళించే పూదోట అయింది. అతని చూపులతో కలవలేని చూపులు కలవరపడి వాలిపోయాయి.

సత్య, నాగలక్ష్మి, శ్రీదేవి అచ్చు సినిమాలో లాగా హీరో కారులో వచ్చి పవిత్రకి లిఫ్ట్ ఇస్తాను రమ్మని పిలుస్తున్న ఆ సన్నివేశం అద్భుతంగా ఉంది. కళ్ళింత చేసుకుని చూస్తున్నారు.

అతను సీటులోనే వెనక్కి జరిగి తల తిప్పి పొడుగాటి చేయి చాపి, డోర్ తీసి "రా పవిత్రా" అన్నాడు.

పాదాలు నేలకి జిగురుతో అంటించినట్టు అడుగువేయడానికి మొరాయిస్తుంటే బొమ్మలా నిలబడి పోయిన పవిత్రని మోచేత్తో పొడుస్తూ "ఊ వెళ్ళు" అన్నారు ముగ్గురూ.

అప్పటికే గేటుదాటి వస్తున్న మిగతా విద్యార్థులు వింతగా చూస్తోంటే పవిత్ర గబుక్కున కారు ఎక్కి, అతని పక్కన సీటులో కూర్చుంది. ఆమె స్నేహితురాళ్ళు ముగ్గురినీ చూస్తూ చిరునవ్వుతో అడిగాడు అతను "మీరు కూడా వస్తారా డ్రాప్ చేస్తాను"

ఊహించని ఆ ఆహ్వానానికి త్రుళ్ళిపడిన ముగ్గురూ "ఊహుహు " అంటూ పరిగెత్తుకుంటూ ముందుకి వెళ్లిపోయారు.

అతను నవ్వుతూ పవిత్ర వైపు చూసి, "వెనక్కి జరిగి దర్జాగా కూర్చో ఎందుకలా ఒంగిపోయి కూర్చున్నావు?" అన్నాడు.

ఆమె కలవరపడిపోతూ "బా బానే కూర్చున్నా" అంటూ కొద్దిగా జరిగింది కానీ వెనక్కి కాదు ముందుకి.

"అలా కాదు పడిపోతావు. ఇలా కూర్చోవాలి"అంటూ ఆమె భుజాలు పట్టుకుని వెనక్కి జరుపుతూ, ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఒక విధమైన కైపుతో అన్నాడు" ఇలా దర్జాగా కూర్చోవాలి. ఇక నుంచి ఈ కార్ నీదే."

ఆ మాటకి ఆమె తత్తరపడుతూ అతని మొహంలోకి చూడడం, అతను కార్ స్టార్ట్ చేయడం ఒకేసారి జరిగింది. కాలేజీ కి, ఇంటికి పెద్ద దూరం లేదు... నడిస్తే పావుగంట, కారులో ఐదు నిమిషాలు. అతని క్లినిక్ ఎక్కడో తెలియదు. అతను తన కాలేజ్ దగ్గరకు ఎలా వచ్చాడు, ఎందుకు వచ్చాడు అనే ప్రశ్నలు మదిలో మెదిలిన వెంటనే తనకోసమే అన్న సమాధానం కూడా లభించడంతో పవిత్ర మొహం కెంజాయ రంగు పులుముకుంది.

మౌనంగా బయటకి చూస్తూ కూర్చున్న ఆమె వైపు చూసి, చిన్నగా నవ్వుకుని అడిగాడు "బామ్మగారు ఎలా ఉన్నారు? నేను రెండు రోజులు బిజీగా ఉండి రాలేకపోయాను."

"బా—మ్మా..." గబుక్కున సమాధానం చెప్పలేక తడబడింది.

“అదే నువ్వు నానమ్మ అంటావు కదా... మీ నానమ్మగారు కాస్త లేచి తిరుగుతున్నారా” అని అడిగాడు.

“ఆ ... తి తిరుగుతోంది” అంది.

“సినిమాకి వెళ్ళారా”

“సి ని మానా?” ఆశ్చర్యంగా మొహం అతని వైపు తిప్పి చూసింది.

“అదే పూజాఫలం” నవ్వుతూ ఆమె వైపు చూసాడు. ఇద్దరి హృదయనయనాలు కలుసుకున్నాయి. కొమ్మకి పూచిన పూలు రెండు గాలికి రాచుకున్నట్టు ఆ హృదయాలు పులకించాయి.

చటుక్కున చూపు తిప్పుకుంది.

“పవిత్రా! నువ్వెంత బాగుంటావో తెలుసా. ఎవరన్నా చెప్పారా నువ్వు చాలా అందంగా ఉంటావని.”

ఆమె మానస సరోవరంలో పూచిన కలువలన్నీ ఒకేసారి రేకులు విప్పుకున్నాయి.

సిగ్గుగా నవ్వింది.

“చెప్పూ ఎవరన్నా చెప్పారా నీకు నీ అందం గురించి.” రెట్టించాడు.

“అందరూ అంటారు” సన్నగా గొణిగినట్టుగా అంది.

“నాలాంటి అబ్బాయిలు ఎవరూ చెప్పలేదా?”

ఒక్క క్షణం ఆ ప్రశ్న ఆమెకి అసందర్భంగా అనిపించింది. కానీ, వెంటనే మోహన్ గుర్తుకొచ్చాడు. అతని మాటలు గుర్తొచ్చాయి. ఫక్కున నవ్వింది.

“ఎందుకు నవ్వుతున్నావు” అడిగాడు

“ఏమి లేదు” అంది పొంగుకొస్తున్న నవ్వు దాచుకుంటూ.

“చెప్పకూడదా”

“ఏమి లేదు” అంది పెదాలు బిగించి.

“నీలో నువ్వే నవ్వుకుంటున్నావు నాకూ చెబితే నేనూ నవ్వుతాగా”

ఆమె మాట్లాడలేదు. హటాత్తుగా తను వెళ్ళాల్సిన దారిలో కాకుండా కారు మరో దారిలో వెళ్తుండడం గమనించి, ఆదుర్దాగా అడిగింది. “మా ఇల్లు ఇటు కాదు”

“మీ ఇంటికి వెళ్ళడంలేదు. నిన్ను తీసుకుని పారిపోతున్నాను.” ఆ స్వరంలో చిలిపిదనం అర్ధంకాని చిన్నపిల్ల కాదు పవిత్ర. చురుక్కున అతని వైపు చూసింది.

“భయంగా ఉందా?” అనడిగాడు.

“నాకేం భయం? ఈ ఊళ్ళో ఎక్కడికి వెళ్ళినా మా ఇంటికి ఎలా వెళ్ళాలో తెలుసునాకు” అంది బింకంగా.

“ఎత్తుకుపోయేవాళ్ళు తెలిసిన చోటుకి తీసుకువెళతారా?” మరోసారి అల్లరి తొంగిచూసింది అతని మాటల్లో.

ఆమె ఇప్పుడు మాట్లాడలేదు. మాట రానంత మూగబోయింది మనసు ఆనందంతో.

కొన్ని క్షణాలు సమాధానం చెప్పకపోవడంతో తలతిప్పి చూసాడు. విండో లో నుంచి బయటకు చూస్తోంది. “నిజంగా తీసుకుని వెళ్తున్నాను అనుకుని, ఎలా పారిపోవాలో అని ఆలోచిస్తున్నావా?” అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది కానీ మనసులో అతని మాటల్లో అర్థాలు ఆలోచిస్తూనే ఉంది.

“ఒకమ్మాయికి పదహారేళ్ళు దాటుతున్నా బొత్తిగా మాటలు రావడం లేదు. ఎందుకో ఓసారి check up చేద్దామని హాస్పిటల్ కి వెళ్తున్నాను. తోడుగా నిన్ను తీసుకుని వెళ్తున్నాను.” అన్నాడు.

“ఎవరా అమ్మాయి?” అని అడగాలనుకుంది పెదవి దాటి పలుకు రాలేదు.

పోస్ట్ ఆఫీస్ , కోర్ట్  స్టేట్ బ్యాంకు, టెలిఫోన్ ఎక్స్చేంజి, ఫైర్ స్టేషన్, ఆఫీసర్స్ క్లబ్ అన్నీ దాటిపోతోంది కారు. దారి నిండా పున్నాగపూల తివాచీ పరచినట్టు ఉంది.

“చూసావా దేవుడే మనకు పూల తివాచీ పరిచాడు” అన్నాడు.

“ఎందుకు?” కొద్దిగా బిడియం పక్కకి జరిగి, కొంటెదనానికి చోటిచ్చింది.

“చెప్తా… ముందు ఒకసారి హాస్పిటల్ కి వెళ్లి పని చూసుకుని, నా క్లినిక్ కి వెళ్ళాక చెప్తాను.” కారు గేటు లోపలికి పోనిస్తూ అన్నాడు.

అది ప్రభుత్వాసుపత్రి. విశాలమైన రెండంతస్తుల భవనం… ఆవరణ మొత్తం పున్నాగ  పూలవర్షం.

“మీరు ఇక్కడ పనిచేస్తారా?” ఆశ్చర్యంగా అడిగింది.

“నన్ను ఇక్కడ డాక్టర్ గా పంపించింది ప్రభుత్వం. మరి ఇక్కడే చేయాలిగా” అన్నాడు నవ్వుతూ కారు ఓ పక్కగా ఆపుతూ.

“కానీ మీకు క్లినిక్ ఉందనికదా అన్నారు.”

“అవును ఉంది. అక్కడికీ తీసుకుని వెళ్తాను అని చెప్పాగా. ఇక్కడ పున్నాగపూలు ఆహ్వానిస్తే, అక్కడ ఇలాంటి గులాబీలు ఆదరిస్తాయి” ఆమె పెదవుల మీద సున్నితంగా తాకి, కారు ఆపాడు.

కెంజాయరంగు పులుముకున్న ఆకాశం నుంచి  ఓ మబ్బు తునక జారి చెంపల మీద రంగులద్దింది… కొన్ని నక్షత్రాలు రతనాల మాలలై మెడని అలంకరించాయి, వెలుగుపూల తలంబ్రాలు కురుస్తుంటే, పట్టపగలు వంద చందమామల వెన్నెలలో ప్రకృతి తడిసిపోయింది.

ఆ స్పర్శలో తానూ స్నానిస్తూ తనని తాను మర్చిపోయింది. అతను నెమ్మదిగా ఆమె చేయి అందుకుని అన్నాడు. “నేను ఎక్కువగా మా ఇంటినే నా క్లినిక్ లాగా వాడుకుంటాను. నా పేషెంట్స్ అక్కడికే వస్తారు. ఉదయం కొద్దిసేపు మాత్రం ఇక్కడికి వచ్చి వెళ్తాను. సాయంత్రాలు నా క్లినిక్ లోనే వైద్యం చేస్తాను. ఇంతకీ నీకు వైద్యం ఎక్కడ కావాలి? ఇక్కడా? నా క్లినిక్ లోనా?” మెత్తగా ఆమె చేతిని నొక్కి తీసాడు.

చుక్కలలోకం నుంచి నేలమీదకి జారింది... ఇంకాసేపు అలాగే ఉండచ్చు కదా! ఆమె స్వరం నీరసంగా ధ్వనించింది. “నాకు వైద్యం దేనికి?”

“చెప్పాగా పదహారేళ్ళు వచ్చినా మాటలు నేర్చుకోని ఒక చిలకకి మాటలు నేర్పాలి అని.”

పవిత్ర మనసు మూగబోయింది... మొహం కందిపోయింది.” నన్ను ఇంటి దగ్గర దింపండి” అంది ఉద్వేగంతో కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే.

“అదేంటి ఏడుస్తున్నావా? దేనికి? నిజంగా నిన్ను కిడ్ నాప్ చేస్తున్నాననుకుంటున్నావా?” లాలనగా అడిగాడు.

తనకే తెలియని ఒక భావోద్వేగంతో వచ్చిన కన్నీరు అది. కారణం తనేం చెప్పగలదు!

తల అడ్డంగా తిప్పుతూ అంది.”కాదు భయం వేస్తోంది.”

“అయ్యో భయం దేనికి? నిన్నేమి చేయను... సరదాకి అన్నాను. అదంతా నిజం అనుకుంటున్నావా? అయినా నీకు మాటలు రాకపోవడం ఏంటి? ఇంకొక్కరోజు నాతో ఇలా వచ్చావంటే నీ మాటలకి నేను బిక్కమొహం వేయాలి.” కొద్దిగా తన భుజం మీదకి ఒంగి తక్కువ స్వరంతో మాట్లాడుతున్న అతని స్వరం, ఆ వెచ్చని ఊపిరి పవిత్రని ఉక్కిరిబిక్కిరి చేసింది.

అతను వెనక్కి జరిగి సీటులో నిటారుగా కూర్చుంటుంటే దూరం అవుతున్న ఆ అనుభూతి కోసం ఆ కన్నె హృదయం గిలగిలాడింది.

“నాకు చిన్న పని ఉంది. అందుకే ముందు ఇక్కడికి వచ్చాను. ఒకళ్ళని కలవాలి. అతనికోసం ఎదురుచూడాలి. హమ్మయ్య. అదుగో వస్తున్నాడు. ఎక్కువసేపు ఎదురుచూడక్కరలేదు. ఒక్క నిమిషం... నువ్వు అలాగే కూర్చో. నేను వెళ్లి అతనితో మాట్లాడి వస్తాను. సరేనా?”

ఆమె అయిష్టంగా తల ఊపింది. అతని ఊపిరి నుంచి వచ్చిన మత్తైన పరిమళం ఆమె భుజం మీద తారట్లాడుతున్నట్టుగా ఉంది. ఆ వెచ్చదనం, ఆ సాన్నిహిత్యం మొదటిసారి పురుషస్పర్శలోని మైకం మరీ, మరీ కావాలనిపిస్తోంది.

అతను కారు దిగి, కారుకి ఎదురు వస్తున్న ఒక వ్యక్తికీ ఎదురువెళ్ళి, అతనితో ఏదో మాట్లాడి, అతని చేతుల్లో ఉన్న ఒక పెద్ద కవర్ తీసుకుని తిరిగి వచ్చాడు.

కారు వెనక సీట్లో ఆ కవర్ పెట్టి, డ్రైవింగ్ సీటులో కూర్చుని కారు స్టార్ట్ చేస్తూ”భయం పోయిందా?” అనడిగాడు.

"భయం దేనికి?" మృదుమధురంగా అంది.

"అయితే ఒక్కసారి నవ్వు నాక్కొన్ని ముత్యాలు కావాలి" అన్నాడు.

"ఎందుకు?" పెంకెగా  అడిగింది.

కొద్దిగా ఒంగి, కళ్ళతో నవ్వుతూ  రహస్యంగా అన్నాడు "నా ప్రేయసికి మాలగా వేస్తాను."

"మీరిలా మాట్లాడితే దిగిపోతాను" సిగ్గుతెరలు నిలువునా కమ్మేస్తుంటే కంపిస్తూ అంది.

"సరే, సరే నా క్లినిక్ కి వెళ్లేదాకా ఏమి అనను సరేనా?"

" ఆలస్యం అయితే  నానమ్మ కంగారు పడుతుంది."

"స్పెషల్ క్లాస్ ఉంది అని చెప్పు. ఇక నుంచి నువ్వు అబద్ధాలు చెప్పడం నేర్చుకోవాలి."

ఆశ్చర్యంగా చూసింది. అతని పెదవుల చివర అల్లరి నవ్వు చిందులేస్తోంది.

కారు తెల్లని రెండంతస్తుల భవనం ముందు ఆగింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS